సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బన్సీలాల్‌పేట డివిజన్ సీసీనగర్‌కు చెందిన కుమారికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో బాధితురాలి భర్త సత్తిబాబుకు సంబంధిత ఎల్వోసీ పత్రాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుర్మ లక్ష్మీపతి, జనార్ధన్, అబ్బాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



దీపక్ జాన్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు, సంఘం నాయకులు

లాలాపేట: తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘ నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపక్ జాన్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ జి. సుదర్శన్, బిషప్ మోజెస్, వీ జోసఫ్, బాల్‌రాజు తదితరులున్నారు.

గ్రంథపాలకుడు హరిబాబుకు సన్మానం



హరిబాబును సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్ పలని కదిరవన్

సనత్‌నగర్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా లైబ్రరీ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఎస్సార్‌నగర్, సనత్‌నగర్ గ్రంథాలయాల గ్రంథ పాలకుడు హరిబాబును బుధవారం ఘనంగా సన్మానించారు. సాధారణ పాఠకులతో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులు, విద్యార్థులు లైబ్రరీ సేవలు వినియోగించుకునేలా తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ వస్తున్నారు. ఆయన సేవలకు గాను చిక్కడపల్లిలోని స్టేట్ లైబ్రరీలో అడిషనల్ కలెక్టర్ పలని కదిరవన్, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ పద్మజ సన్మానించారు. భవిష్యత్‌లో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి పఠనాసక్తిని పెంపొందించి గ్రంథాలయాల ప్రాశస్త్యాన్ని తెలియజేస్తానని హరిబాబు తెలిపారు.

అవార్డు స్వీకరణ

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్‌కు చెందిన ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ ఎల్‌డ్రోక్ ఇండియా కే–12 ఐకేఏ అభిజ్ఞ నైపుణ్య అవార్డును అందుకున్నారు. ఈ మేరకు గతేడాది నిర్వహించిన ఎల్‌డ్రోక్ ఇండియా కె–12 ఐకేఏ సమ్మిట్ అభివృద్ధి నైపుణ్యాల్లో తక్షశిలా పబ్లిక్ స్కూల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు వినూత్నమైన అభ్యసన పద్ధతులను ఉపయోగిస్తున్నారనే విషయంలో ఎంపికై ఇటీవలే హైదరాబాద్ ఐటీసీ కోహినూర్‌లో జరిగిన సదస్సులో తనుప్రీత్‌కౌర్ ఈ అవార్డును అందుకున్నారు.

నిజాయితీ చాటుకున్న ట్రాఫిక్ హోంగార్డు



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు చిట్టిబాబు

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న చిట్టిబాబు నిజాయితీని చాటుకున్నాడు. బేగంపేట హెచ్‌పీఎస్ అవుట్ గేట్ వద్ద బందోబస్తు విధులు నిర్వర్తిస్తుండగా ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న శాంసంగ్ స్మార్ట్ ఫోన్ దొరికింది. వెంటనే ఫోన్ యజమానిని గుర్తించి అందజేశారు. దీంతో సదరు ప్రయాణికుడు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు చిట్టిబాబును అభినందించి శాలువాతో సత్కరించారు.

అభినందనల వెల్లువ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నుంచి వివిధ వర్సిటీలకు వీసీలుగా నియమితులైన ప్రొఫెసర్లకు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్స్‌కు విద్యార్థుల అభినందనలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డా.ప్రేమ్ కుమార్ ఓయూ ప్రొఫెసర్, చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ వీసీ ప్రొ.సూర్యధనుంజయ్‌కు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.రమేశ్ కుమార్‌కు పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర నాయకుడు అల్లూరి విజయ్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీంకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.ప్రభాకర్‌కు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బర్త్‌డే వేడుకల్లో స్నేహితుల మధ్య ఘర్షణ

అమీర్‌పేట: బర్త్‌డే వేడుకల్లో స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాపునగర్ ఓయో టౌన్ హౌజ్‌లో సోమవారం రాత్రి హోటల్ రిసెప్షన్ సాయి జన్మదిన వేడుకలకు తన మిత్రుడైన జీవన్ 202,204 గదులు బుక్ చేశాడు. అవి పూర్తికాగానే సాయి మిత్రులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో సాయి మరో మిత్రుడైన సిద్ధార్థ్ లోకేష్, అనిల్‌తో మరో వ్యక్తి హోటల్‌కు వచ్చాడు. పార్టీలో పాల్గొనేందుకు వచ్చామని చెప్పగా సాయి మిత్రులు కొందరు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సిద్ధార్థ్‌తో పాటు వెంట వచ్చిన మరో ముగ్గురు బీరు సీసాలు పగులగొట్టి దాడికి పాల్పడ్డారు. దీంతో నరేశ్, సాయి పూజిత్ అనే ఇద్దరు యువకుల మెడ, చేతి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. జీవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ నివారణకే 'ఆపరేషన్ రోప్'

- బాటిల్ నెక్స్‌పై ప్రత్యేక దృష్టి
- ట్రాఫిక్ ఉల్లంఘనులకు కౌన్సెలింగ్, జరిమానాలు
- వేగ నియంత్రణకు లేజర్ గన్‌ల ఏర్పాటు

'సాక్షి' ఇంటర్వ్యూలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టేందుకు కాదు



సనత్‌నగర్: వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేలా చూసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నదే 'ఆపరేషన్ రోప్' ముఖ్య లక్ష్యమని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు స్పష్టం చేశారు. చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం ట్రాఫిక్ అధికారులకు లేదని, ట్రాఫిక్ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే సూచనల మేరకు తన పరిధిలోని బేగంపేట, మహంకాళి, గోపాలపురం, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఏసీపీ శంకర్‌రాజుతో 'సాక్షి' ఇంటర్వ్యూ..

సాక్షి: కీలకమైన బేగంపేట రోడ్డులో బాటిల్‌నెక్స్ పాయింట్ల వద్ద ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాఫిక్ ఏసీపీ: రసూల్‌పురా చౌరస్తా దాటిన తర్వాత నందిని హోటల్ దగ్గర, మీటింగ్ పాయింట్ కేఫ్ తదితర ప్రాంతాల్లో బాటిల్ నెక్స్‌ను గుర్తించాం. మీటింగ్ పాయింట్ వద్ద విస్తరణకు కంటోన్మెంట్ సీఈఓకు లేఖ రాసినం. అలాగే రసూల్‌పురా చౌరస్తా సమీపంలో ఫంక్షన్ హాల్ నిర్వాహకులతో మాట్లాడినం. కొత్తగా నిర్మాణం చేసే సమయంలో రోడ్డువైపు సెట్ బ్యాక్‌కు వదిలేస్తామని వారు హామీనిచ్చారు. ఇలా బాటిల్‌నెక్స్ వద్ద వాహనాల వేగం తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: ప్రధాన రహదారుల్లోని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఏమైనా దృష్టి పెట్టారా?

ట్రాఫిక్ ఏసీపీ: బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎదురుగా పెట్రోల్ బంక్, మారేడ్‌పల్లి గ్రిల్, కార్ఖానా పోలీస్‌స్టేషన్ సమీపంలో, కర్బలా మైదానం.. ఇలా పలుచోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించినం. నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీకి లేఖ రాసినం. వచ్చే వేసవిలోగా పనులు పూర్తయ్యేలా చూస్తాం.

సాక్షి: ఫ్రీ లెఫ్ట్‌లకు అడ్డంకుల తొలగింపుపై ఏం చేయబోతున్నారు?

ట్రాఫిక్ ఏసీపీ: సంగీత్ దగ్గర ఫుట్‌పాత్ భాగం ఎక్కువగా ఉంది. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా అక్కడ ఫుట్‌పాత్‌ను కొంత తగ్గించి ఫ్రీ లెఫ్ట్‌కు మరింత సులభతరం చేస్తాం. అలాగే ప్యాట్నీ సీఎంఆర్ వద్ద జియో, యాక్ట్ ఫైబర్ వంటి స్తంభాలను తొలగించి అక్కడ ఫ్రీ లెఫ్ట్‌ను తొలగించాం. అదేవిధంగా ప్యాట్నీ ఎస్‌బీఐ వద్ద అడ్డుగా ఉన్న చెట్లను జీహెచ్ఎంసీతో కలిసి రీలొకేట్ చేసి అక్కడ కూడా ఫ్రీ లెఫ్ట్‌కు అడ్డంకులు లేకుండా చూస్తాం.

సాక్షి: ఆపరేషన్ రోప్‌తో చిరువ్యాపారుల ఉపాధికి దెబ్బ అని వస్తున్న విమర్శలపై మీ స్పందన?

ట్రాఫిక్ ఏసీపీ: ఆపరేషన్ రోప్ అనేది ఒకరిని ఇబ్బంది పెట్టేది కాదు. ప్రజల రాకపోకలు, పాదచారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. చిరువ్యాపారులు కూడా దీనిని అర్థం చేసుకుంటున్నారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపునకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

సాక్షి: వేగ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాఫిక్ ఏసీపీ: వాహనదారులకు తరచూ అవగాహన కల్పించడంతో పాటు మితిమీరిన వేగంతో వెళ్లేవారిని గుర్తించేలా లేజర్‌గన్‌లను కూడా ఏర్పాటుచేసినం. ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది లేజర్‌గన్ సాయంతో వేగాన్ని నిర్ధారించి జరిమానాలు విధిస్తున్నారు. ఇప్పటివరకు స్పీడ్ లిమిట్ దాటిన 8,108 మందిని గుర్తించి చలాన్లు వేశాం. సాధారణంగా 60–65 దాటితే జరిమానాలు విధిస్తాం.

సాక్షి: ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాఫిక్ ఏసీపీ: స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడేవారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు జరిమానాలూ విధిస్తున్నాం. నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్, మోడిఫైడ్ సైలెన్సర్ల ఏర్పాటు, నంబర్ ప్లేట్, సైరన్, టింటెడ్ గ్లాస్, ఫిలీం ఏర్పాటు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్..ఇలా అన్ని రకాల ఉల్లంఘనులను ఉపేక్షించకుండా వారికి జరిమానాలు వేస్తున్నాం.

సాక్షి: మీ పరిధిలో వీఐపీ, వీవీఐపీల మూవ్‌మెంట్‌కే ప్రాధాన్యత అని ఇస్తున్నారన్న దానిపై స్పందన?

ట్రాఫిక్ ఏసీపీ: బేగంపేట ఎయిర్‌పోర్ట్ కారణంగా సాధారణంగానే వీఐపీ, వీవీఐపీల మూవ్‌మెంట్ ఉంటుంది. ట్రాఫిక్ సిబ్బంది కూడా విధుల్లో భాగంగా రోడ్ల మీదనే ఉంటారు. వీఐపీల రాకపోకల సమయంలో ఓ వైపు బందోబస్తు చూస్తునే మరోవైపు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు.

పవర్ బోర్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: అడ్డగుట సీ సెక్షన్‌లో పవర్ బోర్ పనులను కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, ఎల్లయ్య, అమర్, నర్సింగ్, అయోధ్య, అల్లాబక్షు, మల్లేశ్, శంకర్, దేవయ్య, మహేందర్, రామస్వామి, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంతో అనేక అనర్థాలు

రసూల్‌పురా: డ్రగ్స్ వాడకంతో అనేక అనర్థాలు జరుగుతాయని తిరుమలగిరి సీఐ నాగరాజు సూచించారు. తిరుమలగిరి ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే పరిణామాలు, సైబర్ క్రైమ్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారిస్తూ ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. కొందరు కంప్యూటర్ నెట్‌వర్క్‌తో ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు సేకరించి ఖాతాల్లోని నగదును తస్కరిస్తారని కొత్త నంబర్లతో వచ్చే కాల్స్ మాట్లాడవద్దని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎస్ నాగరాజు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



రసూల్‌పురా: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరో వార్డు సీతారాంపూరంలోని శ్రీ వీరాంజనేయ శివ పంచాయతన ఆదిత్య నవగ్రహ ఆలయ ముఖద్వార నిర్మాణ శంఖుస్థాపనకు బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నగర కమిషనర్‌ను కలిసి ప్రతి ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకరయ్య గౌడ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, బీజేపీ నాయకులు భానుక మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకుడు అజయ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ క్రీడాపోటీలు షురూ



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: స్థానిక లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్సార్‌నగర్ జోన్ నారాయణ విద్యా సంస్థల ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలను సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నాయి. అత్తాపూర్, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, మణికొండ, ఎస్సార్‌నగర్, విజయ్‌నగర్‌కాలనీ బ్రాంచ్‌లకు చెందిన నారాయణ పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నారు. కబడ్డీ, ఖోఖో, దాచబాల్, 100, 400 మీటర్ల పరుగు పందేల్లో తలపడనున్నారు. ఈ నెల 23న ముగింపు రోజున బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. అంతకముందు క్రీడా జ్యోతిని వెలిగించి వివిధ బ్రాంచ్‌ల విద్యార్థులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నారాయణ విద్యా సంస్థల ప్రతినిధులు లక్ష్మి, శర్వాణి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రి రాఘవయ్యకు రైల్వే పింఛనుదారుల మద్దతు



మర్రి రాఘవయ్యను సన్మానిస్తున్న రైల్వే పింఛనుదారుల సంఘం ప్రతినిధులు

చిలకలగూడ : రైల్వే కార్మిక శాఖ గుర్తింపు ఎన్నికల్లో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యకు రైల్వే పింఛనుదారుల సంఘం అనుబంధ వర్క్‌షాపు మెకానికల్ బ్రాంచ్ ప్రతినిధులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చిలకలగూడలోని సంఘ కార్యాలయంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాఘవయ్య హాజరై మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశానని పేర్కొన్నారు. డిసెంబర్ 4,5,6 తేదీల్లో జరగనున్న ఎన్నికల్లో తనతోపాటు సంఘం న్యాయకత్వాన్ని బలపర్చాలని కోరగా, సభ్యులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. సభకు అధ్యక్షత వహించిన రైల్వే పింఛనుదారుల సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాఘవరావు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. అనంతరం వర్క్‌షాపు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రభాకర్ అంద్రూ, రామకృష్ణమాచార్యులు, బాబు నాయక్, రాజేందర్, జయపాల్, బీకేసింగ్, రాజన్, నారాయణ, విద్యాసాగర్, గోవిందరాజులు, ఏజీకే మూర్తి, జహంగీర్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులతో సమావేశం

సికింద్రాబాద్: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత హైదరాబాద్ రైల్వే డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డివిజన్ ఇంజినీర్ ముత్యాలు నాయుడు, లాలాగూడ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ నరేందర్ రెడ్డి తదితరులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై చర్చించారు.విజయపురి కాలనీలో నాలాపై స్లాబ్ నిర్మాణం, నాలా విస్తరణ సహకారానికి రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అదేవిధంగా కేశవనగర్ కాలనీ ప్రజల ఇబ్బందులు తీర్చేలా సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే అందించిన ప్రతిపాదనలను రైల్వే అధికారులకు అందించారు. అలాగే దశాబ్దాలుగా ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదులకు రైల్వే అధికారులు నోటీసులు జారీ చేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఆమె వెంట జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేర్రాజు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ



గార్బేజ్ వీల్ బ్యారేజీలను అందజేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు చెత్త తరలింపు రిక్షాలు, గార్బేజ్ వీల్ బ్యారేజీలను మంజూరు చేసింది. కాగా కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద బుధవారం వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది అరవింద్, వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ మోహన్‌రెడ్డినగర్‌లో రూ.19 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, బీరయ్య, బీఆర్ఎస్ నాయకులు మహాత్మాచారి, కుమార్, లలిత, రాజు, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న శశిధర్ శాస్త్రి తదితరులు

రసూల్‌పురా: న్యూబోయిన్‌పల్లి దుబాయ్‌గేట్ వద్ద ఆదర్శ్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 26వ శాఖను ఆర్‌బీఐ విశ్రాంత మేనేజర్ శశిధర్ శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ బ్యాంక్ చైర్మన్ మదన గోపాలాస్వామి మాట్లాడుతూ చిన్న, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారులకు చేయూతనిచ్చేలా తక్కువ మొత్తంలో పూచీకత్తు లేకుండా రుణాలు అందజేస్తామని తెలిపారు. తమ నూతన బ్రాంచిలో లాకర్ల సదుపాయం కూడా ఉందని చెప్పారు. అన్ని రకాల మదుపుదారులు, సీనియర్ సిటిజన్లకు ఆకర్షణీయమైన వడ్డీరేట్లను అందజేస్తామని పేర్కొన్నారు. వారంలో ఏడు రోజులు ఖాతాదారులకు తమ సిబ్బంది సేవలు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆదిత్య, మాజీ చైర్మన్ చిలుకూరి గంగరావు, సీఈవో ఎంవీ. రమణ, ఏజీఎంలు అయ్యప్ప నాయుడు, కామినేని శ్రీనివాస్ రావు, నూతన బ్రాంచి మేనేజర్ వెంకటేశం, సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



అవగాహన కార్యక్రమంలో చిన్నారులతో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని హీరో మోటో కార్ప్ కార్యాలయంలో బచపన్ పాఠశాల చిన్నారులకు 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అంతేగాకుండా తల్లిదండ్రులు, వాహన యజమానికి జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. రూ.25 వేల జరిమానాతో పాటు వాహనం రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేయబడుతుందన్నారు. జీబ్రా లైన్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని సిగ్నల్ జంపింగ్ అతి ప్రమాదకరమన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్ ప్రతినిధి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు..

రాంగోపాల్‌పేట: ఎంజీరోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో బేగంపేట ట్రాఫిక్ పోలీసులు బుధవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం కృష్ణ, ఆర్ఐ కృష్ణ, ప్రిన్సిపాల్ స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ బబిత, డీన్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాతో అన్నానగర్‌లో సంబురాలు



కుళాయి నల్లా వద్ద సంబురాల్లో శాంసన్‌రాజు, మహిళలు

రసూల్‌పురా: కంటోన్మెంట్‌లో ప్రస్తుతం సరఫరా అవుతున్న 59 లక్షల గ్యాలన్ల తాగునీటికి అదనంగా మరో లక్ష గ్యాలన్ల తాగునీటిని సరఫరా చేస్తుండడంపై కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి శాంసన్ రాజు ఆధ్వర్యంలో అన్నానగర్‌లోని వీధీ కుళాయి వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేసి మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుంచి బోర్డు పరిధిలో 5.9 ఎంజీడీ నీటి సరఫరా జరుగుతోందని పెరిగిన నివాస గృహాలు, జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా లేకపోవడంతో ఐదు నుంచి వారానికి ఒకసారి మాత్రమే తాగు నీటి సరఫరా జరిగేదన్నారు. అయితే కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బోర్డు ద్వారా మెట్రో వాటర్‌వర్క్స్‌కు చెల్లించాల్సిన అదనపు నీటి కనెక్షన్లు రూ. 24 కోట్ల మాఫీతో పాటు అదనంగా వన్ ఎంజీడీ తాగు నీటి సరఫరాకు సీఎం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఇకనుంచి రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు మురళి, నాగరాజు, ధర్మి, యాదగిరి, అస్గర్, మహేశ్, మహేశ్వరి, బాలమణి, రజిత పద్మ, నర్సమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

కాశీకి వెళ్తూ యువకుడి మృతి



వినోద్

సికింద్రాబాద్: కాశీకి వెళ్తూ అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతిలోని కపిలతీర్థం ప్రాంతానికి చెందిన తనుకుల వినోద్ (28) తన తల్లితో కలిసి రైలులో కాశీకి వెళ్తున్నాడు. అనారోగ్య సమస్యతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగారు. అయితే, మంగళవారం రాత్రి ప్లాట్‌ఫాం నంబర్–2 లో పడుకున్న వినోద్ మరుసటి రోజు ఉదయం నిద్ర లేచేసరికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.


గుర్తు తెలియని వ్యక్తి..

అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబర్ 6లో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సుమారు 80–85 వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు.

మద్యానికి బానిసై ..

బౌద్ధనగర్: మద్యానికి బానిసైన వ్యక్తి మృతి చెందిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్టలోని లోహియానగర్‌కు చెందిన ఎం.విశాల్ (28) వృత్తిరీత్యా పెయింటర్. మద్యానికి బానిసైన విశాల్ 10 రోజుల క్రితం ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లాడు. ఈనెల 20న ఉదయం 7 గంటలకు వారాసిగూడ మూన్ రాక్ బార్ వద్ద నున్న పాన్ షాప్ సమీపంలో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే పాన్‌షాప్ నిర్వాహకుడు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మందులు అందజేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తబిత స్త్రీ, శిశు సేవా ఆశ్రమ వ్యవస్థాపకుడు అహరోన్ తీగుళ్ల సూచించారు. శాంతినగర్‌లోని షీబాలత హైస్కూల్ ఆవరణలో ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్‌తో పాటు జనరల్ చెకప్ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆశ్రమం ఆధ్వర్యంలో 22 ఏళ్లుగా అనాథలు, గర్భిణులు, దివ్యాంగులకు సేవలందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సేవా ఆశ్రమం డైరెక్టర్ ఎలిషమ్మ, ఉపాధ్యక్షురాలు యాదమ్మ, కార్యదర్శి రోజా, డాక్టర్ రెబెక్కా ప్రియదర్శిని, సిబ్బంది వెనోరికా మోసెస్, అభిగాయల్ తదితరులు పాల్గొన్నారు.